



# బిజినెస్





## గూగుల్ పిక్సెల్ ఫోన్లపై నిషేధం విధించిన ఇండోనేషియా

గూగుల్ పిక్సెల్ ఫోన్ల అమ్మకాలపై ఇండోనేషియా కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలో గూగుల్ పిక్సెల్ ఫోన్ల అమ్మకాలను నిషేధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఐఫోన్ 16 వినియోగాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించిన కొద్ది రోజులకే ఈ నిర్ణయం తీసుకుంది. ఇండోనేషియాలో విక్రయించే నిర్దిష్ట స్మార్ట్‌ఫోన్‌ల్లో కనీసం 40 శాతం స్థానికంగా తయారు చేయబడిన భాగాలను కలిగి ఉండాలనే నిబంధనలను గూగుల్ పాటించనందున ఈ నిర్ణయం తీసుకుంది. నిషేధంపై గూగుల్ స్పందిస్తూ.. ఇండోనేషియాలో పిక్సెల్ ఫోన్‌లు అధికారికంగా పంపిణీ చేయబడలేదని గూగుల్ పేర్కొంది. స్థానిక కంటెంట్‌కు సంబంధించిన ధృవీకరణ పొందేవరకు గూగుల్ తన పిక్సెల్ స్మార్ట్‌ఫోన్‌లను విక్రయించదు. ఇండోనేషియాలోని పెట్టుబడిదారులందరికీ అవకాశం అందించేందుకు, ప్రాంతీయ పారిశ్రామిక విలువను పెంచడానికి ఈ కొత్త నియమాలను తీసుకొచ్చింది.

"ఇండోనేషియాలో పెట్టుబడి పెట్టే పెట్టుబడిదారులందరి కోసం స్థానిక కంటెంట్ సంబంధిత విధానాలు రూపొందించినట్టు పరిశ్రమ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఫెబ్రి హెండ్రీ ఆంటోని అరీఫ్ పేర్కొన్నారు.



# అక్టోబర్‌లో అత్యధిక జిఎస్‌టి వసూళ్లు


అక్టోబర్ నెలలో జిఎస్‌టి వసూళ్లు రూ.1.87 కోట్లను అధిగమించాయి. గతేడాదిలో అక్టోబర్‌తో పోలిస్తే.. 9 శాతం పెరిగినట్లు ఆర్థిక శాఖ శుక్రవారం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. గతేడాది అక్టోబర్‌లో రూ 1.72 లక్షల కోట్లు వసూలయ్యాయి. సెప్టెంబర్ నెలలో 40 నెలల కనిష్ట స్థాయి 6.5 శాతం నుండి అక్టోబర్‌లో 8.9 శాతానికి వృద్ధి పుంజుకోవడంతో, రెండవ అత్యధిక నెలవారీ వసూళ్లుగా రికార్డు నమోదైంది. సిజిఎస్‌టి, ఎస్‌జిఎస్‌టి, ఐజిఎస్‌టి మరియు సెస్ అక్టోబర్‌లో పెరిగినట్లు నివేదిక పేర్కొంది. 2024లో ఇప్పటివరకు, మొత్తం జిఎస్‌టి వసూళ్లు 9.4 శాతం పెరిగి రూ.12.74 లక్షల కోట్లకు చేరాయి. 2023లో ఇదే సమయంలో రూ.11.64 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో జిఎస్‌టి రికార్డు గరిష్ట స్థాయి రూ. 2.10 లక్షల కోట్లకు చేరుకున్న సంగతి తెలిసిందే. 2023-24 ఆర్థిక సంవత్సరంలో, స్థూల జిఎస్‌టి వసూళ్లు గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 11.7 శాతం పెరుగుదలతో రూ. 20.18 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దేశీయ లావాదేవీల నుండి జిఎస్‌టి 10.6 శాతం వృద్ధి చెంది రూ.1.42 లక్షల కోట్లకు చేరుకుంది, అయితే అక్టోబర్ 2024లో దిగుమతులపై పన్ను దాదాపు 4 శాతం పెరిగి రూ.45,096 కోట్లకు చేరుకుంది.

# రెపో రేటును 25 పాయింట్లు తగ్గించనున్న ఆర్‌బీఐ?



భారతదేశ ఆర్థిక వృద్ధిని పెంచేందుకు డిసెంబర్ మాసంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన కీలక పాలసీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.మొత్తంగా 25 బేసిస్ పాయింట్స్ తగ్గించి 6.25 శాతానికి చేరుకుంటుంది. ఇకపోతే, సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం 5.49 శాతానికి పెరగగా, ప్రస్తుత త్రైమాసికంలో ఇది 4.9 శాతానికి పడిపోతుందని అంచనా వేస్తున్నారు ఆర్థికవేత్తలు. అంతేకాకుండా ఆ తర్వాతి జనవరి-మార్చి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 4.6 శాతానికి తగ్గవచ్చని అంచనాలు వేస్తున్నారు. దీంతో ఆర్‌బీఐ రేట్లను తగ్గించేలా అర్థమవుతుంది. ద్రవ్యోల్బణం, వృద్ధి మధ్య సమతుల్యత "బాగా దెబ్బతింది" అని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. వచ్చే త్రైమాసికంలో ద్రవ్యోల్బణం తగ్గుతుందని ఆయన ఆశిస్తున్నట్లు ఓ మీడియాతో తెలిపారు. ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో, ఆర్‌బిఐ తన వైఖరిని మునుపటి నుండి అనుకూల వైఖరికి తటస్థంగా మార్చుకుంది. ఇప్పుడు, ఆర్థికవేత్తలు వృద్ధిలో కనిష్ట మందగమనాన్ని అంచనా వేస్తున్నారని, అందువల్ల రేటు తగ్గింపు అవకాశం ఉందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అయితే, ఓ సర్వే ప్రకారం 57 మంది ఆర్థికవేత్తలలో 30 మంది మెజారిటీ తదుపరి ద్రవ్య విధాన సమావేశంలో రెపో రేటులో 25 బేసిస్ పాయింట్లను 6.25 శాతానికి తగ్గించాలని భావిస్తున్నారు. మిగిలిన వారు రేటులో ఎటువంటి మార్పును సూచించలేదు. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేస్తున్నారు. అయితే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి అంచనా 8.2 శాతం నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.9 శాతానికి, వచ్చే ఏడాది 6.7 శాతానికి తగ్గింది. ఆర్‌బీఐ అంచనా వేసిన 7.2, 7.1 శాతం కంటే ఇది చాలా తక్కువ.

# భారత్‌లో యాపిల్‌కు రికార్డు ఆదాయాలు



ఐఫోన్ తయారీ కంపెనీ యాపిల్, భారత్‌లో ఆల్‌టైం రికార్డు ఆదాయాన్ని నమోదు చేస్తోందని సీఈఓ టిమ్ కుక్ పేర్కొన్నారు. సెప్టెంబరు 2024 త్రైమాసికంలో ఐప్యాడ్ విక్రయాల్లో రెండంకెల వృద్ధి కనిపించిందని పేర్కొన్నారు. ఏడాది కిందట ఇదే మూడు నెలలతో పోలిస్తే సంస్థ మొత్తం నికర విక్రయాలు 89.49 బి. డాలర్ల నుంచి 6% వృద్ధితో 94.93 బిలియన్ డాలర్లు (సుమారు రూ.8 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి. 'అమెరికా, ఐరోపా, ఇతర ఆసియా పసిఫిక్ ప్రాంతాల్లోనూ సెప్టెంబరు త్రైమాసికంలో రికార్డు ఆదాయం నమోదు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. అమెరికా, బ్రెజిల్, మెక్సికో, ఫ్రాన్స్, బ్రిటన్, కొరియా, మలేషియా, థాయ్‌ల్యాండ్, సౌదీ అరేబియా, యూఏఈల్లో ఎక్కువ గణాంకాలు నమోదవుతాయి. భారత్ విషయానికొస్తే ఆల్‌టైం రికార్డు ఆదాయాన్ని నమోదు చేయనున్నామ'ని టిమ్ కుక్ కంపెనీ ఎర్నింగ్స్ కాల్‌లో పేర్కొన్నారు. సెప్టెంబరు త్రైమాసికంలో భారత్‌లో రెండు(ముంబయి, దిల్లీ) కొత్త స్టోర్లను ఏర్పాటు చేశాం. నాలుగు కొత్త స్టోర్లను త్వరలోనే ఏర్పాటు చేస్తామనీ తెలిపారు. పుణె, బెంగళూరు, దిల్లీ-ఎన్‌సీఆర్, ముంబయిలలో ఇవి రానున్నాయని కంపెనీ ప్రకటించింది.

# దేశంలో రెండు లక్షల కిరాణా షాపులు బంద్..



దేశంలో ఆన్‌లైన్ కొనుగోళ్ల సంస్కృతి క్రమంగా పెరుగుతోంది. చిప్స్ ప్యాకెట్, చాక్లెట్ నుంచి మొదలుకుని ఏ వస్తువు కావాలన్నా కూడా అనేక మంది ఆన్‌లైన్ సేల్స్ వైపే మొగ్గుచూపుతున్నారు. ఇటీవల మార్కెట్లోకి వచ్చిన క్విక్ కామర్స్ సంస్థలు జెప్టో, బ్లింకిట్ వంటి కంపెనీలు 10 నిమిషాల్లోనే వారి గిడ్డంగుల నుంచి ఆయా వస్తువలను కస్టమర్ల ఇంటికి తెచ్చి డెలివరీ చేస్తున్నాయి. దీంతో అనేక మంది ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేసేందుకు ఇష్టపడుతున్నారు. దీనికి తోడు పలురకాల ఆఫర్ల పేరుతో కస్టమర్లకు తక్కువ ధరకు ఉత్పత్తులను ఇస్తామని ప్రకటిస్తున్న నేపథ్యంలో ప్రధానంగా నగరాల్లోని జనాలు వీటివైపే చూస్తున్నారు. ఈ ఆన్‌లైన్ విక్రయాల ప్రభావం కాస్తా సూపర్‌మార్కెట్లు, కిరాణా షాపులపై పడింది. దీంతో గత కొన్ని నెలల్లో దేశవ్యాప్తంగా దాదాపు రెండు లక్షల కిరాణా షాపులు మూతపడ్డాయి. ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ ఈ నివేదికను ప్రకటించడం విశేషం. క్విక్ కామర్స్ వ్యాపారం వేగంగా వృద్ధి చెందడం వల్ల సుమారు 2 లక్షల కిరాణా షాపులు బంద్ అయినట్లు ప్రకటించారు. ఈ వృద్ధి ప్రధానంగా మెట్రోపాలిటన్ ప్రాంతాల్లో అత్యధిక ప్రభావాన్ని చూపిచింది. ఆ తర్వాత టైర్-1 నగరాల్లో (30 శాతం), టైర్ 2, 3 నగరాల్లో (25 శాతం) కిరాణా దుకాణాలు మూసివేయబడ్డాయి. నివేదిక ప్రకారం మెట్రోలలో నెలవారీ సగటు టర్నోవర్ రూ. 5.5 లక్షలతో 17 లక్షల దుకాణాలు ఉన్నాయి. వాటిలో 45% మూతపడ్డాయి. సగటు నెలవారీ టర్నోవర్ రూ. 3.5 లక్షలతో 12 లక్షల దుకాణాలు ఉన్న టైర్-1 నగరాల్లో 30% దుకాణాలు మూతపడగా, టైర్-2 నగరాల్లో 25% షాపులు బంద్ అయ్యాయి. దేశంలో మొత్తం 1.3 కోట్ల కిరాణా షాపులున్నాయి. వీటిలో టైర్ 1 నగరాల్లో అంటే పెద్ద నగరాల్లో 12 లక్షల దుకాణాలు ఉండగా, టైర్-2, టైర్-3 నగరాల్లో కోటి కిరాణా షాపులున్నాయి.

# చిక్కుల్లో అనిల్ అంబానీ..

## సెబీ డిమాండ్ నోటీస్‌లో ఏముదంటే..?



రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, ఆరు అనుబంధ కంపెనీలు రూ. 154.50 కోట్లు చెల్లించాలని సెబీ నోటీసులు జారీ చేయడంతో రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ సవాళ్లు ఎదుర్కొంటున్నారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి బకాయిలను చెల్లించాలని దీనికి ఈ సంస్థలకు 15 రోజుల గడువు ఇచ్చింది. పాటించకుంటే ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేస్తామని సెబీ హెచ్చరించింది. క్రెస్ట్ లాజిస్టిక్స్, రిలయన్స్ యూనికార్న్ ఎంటర్‌ప్రైజెస్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ బ్రాడ్‌కాస్ట్ హోల్డింగ్స్ వంటి కంపెనీలు గతంలో చెల్లించకుండా మిగిలిపోయాయి. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ ప్రమోటర్ సంస్థతో సహా 6 సంస్థలకు రూ. 154.50 కోట్లు చెల్లించాలని సెబీ బుధవారం డిమాండ్ నోటీసులు పంపింది. 15 రోజుల్లోగా చెల్లించకుంటే ఆస్తులు, బ్యాంకు ఖాతాలను జప్తు చేస్తామని రెగ్యులేటర్ ఈ సంస్థలను హెచ్చరించింది. క్రెస్ట్ లాజిస్టిక్స్ అండ్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రస్తుతం సీఎల్ఈ ప్రైవేట్ లిమిటెడ్), రిలయన్స్ యూనికార్న్ ఎంటర్‌ప్రైవేట్ లిమిటెడ్, రిలయన్స్ ఎక్స్ఛేంజ్ నెక్స్ట్ లిమిటెడ్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్ లిమిటెడ్, రిలయన్స్ బిజినెస్ బ్రాడ్కాస్ట్ న్యూస్ హోల్డింగ్స్ లిమిటెడ్, రిలయన్స్ క్లీన్జెన్ లిమిటెడ్లకు నోటీసులు పంపారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఆగస్టులో విధించిన జరిమానాను చెల్లించడంలో ఈ సంస్థలు విఫలం కావడంతో డిమాండ్ నోటీసులు అందాయి. ఈ ఆరు సంస్థలకు చెరో రూ. 25.75 కోట్లు చెల్లించాలని ఆరు వేర్వేరు నోటీసుల్లో మార్కెట్ వాచ్ డాగ్ ఆదేశించింది. ఇందులో 15 రోజుల్లో వడ్డీ, రికవరీ ఖర్చులు ఉంటాయి. బకాయిలు చెల్లించని పక్షంలో ఈ సంస్థల చరాస్తులు, స్థిరాస్తులను జప్తు చేసి విక్రయించడం ద్వారా మార్కెట్ రెగ్యులేటర్ ఆ మొత్తాన్ని రికవరీ చేస్తుంది. అంతేకాకుండా వారి బ్యాంకు ఖాతాలను జప్తు చేయాల్సి ఉంటుంది.

ఈ ఏడాది ఆగస్టులో పారిశ్రామికవేత్త అనిల్ అంబానీతో పాటు రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ మాజీ కీలక అధికారులు సహా 24 సంస్థలను సెక్యూరిటీస్ మార్కెట్ నుంచి ఐదేళ్ల పాటు సెబీ నిషేధించింది.

# రాణించిన సూచీలు..

## లాభాలతో కొత్త సంవత్సరం ప్రారంభం

దీపావళి సందర్భంగా ప్రత్యేకంగా నిర్వహించిన మూరత్ ట్రేడింగ్‌లో సూచీలు అదరగొట్టాయి. గంటపాటు నిర్వహించిన ఈ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 300 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 24,300 వద్ద ముగిసింది. అన్ని రంగాల షేర్లూ లాభాల్లో ముగిశాయి. ముఖ్యంగా ఆటో మొబైల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దుతు కనిపించింది. దీంతో రెండు రోజుల సూచీల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. కొత్త సంవత్ లాభాలతో మొదలైంది. సెన్సెక్స్ సాయంత్రం 6 గంటలకు 635 పాయింట్ల లాభంతో 80,024 వద్ద లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే లాభం క్షీణించినప్పటికీ.. ఆద్యంతం లాభాల్లోనే కొనసాగింది. చివరికి 335 పాయింట్ల లాభంతో 79,724.12 వద్ద ముగిసింది. నిఫ్టీ 94.20 పాయింట్లు లాభపడి 24,299.55 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లూ లాభాల్లో ముగిశాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా మోటార్స్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఉగాది నుంచి తెలుగు సంవత్సరాది.. జనవరి 1 నుంచి క్యాలెండర్ ఇయర్.. ఏప్రిల్ 1 నుంచి ఆర్థిక సంవత్సరం ఎలా ప్రారంభమవుతుందో.. మార్కెట్లకు దీపావళితో కొత్త ఏడాది ప్రారంభమవుతుంది. నేటి నుంచి సంవత్ 2081 ప్రారంభమైంది. దీపావళి రోజున ఏదైనా పని ప్రారంభిస్తే విజయం వరిస్తుందన్నది భారతీయుల విశ్వాసం.



అదే తరహాలో స్టాక్ మార్కెట్‌లో ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే.. వచ్చే దీపావళి వరకు లాభాల పంట పండుతుందని చాలా మంది భావిస్తారు. ఆ నమ్మకంతోనే చాలా మంది మూరత్ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు మక్కువ చూపుతుంటారు. చాలా మంది ఈ ట్రేడింగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఇప్పటికే పెట్టుబడులు పెడుతున్న వారికీ, కొత్తగా మార్కెట్లోకి రావాలనుకునే వారికీ ఇది ఎంతో ప్రత్యేకం.

# చక్కని ఆరోగ్యం

## అరటిపండు తింటే జలుబు వస్తాయా?



అరటిపండు దాదాపు అందరూ ఇష్టపడే పండు. ఈ పండు రుచితో పాటు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. అరటిపండులో పోషకాలు  పుష్కలంగా ఉన్నాయి. వాటిలో కాల్షియం, ప్రోటీన్, పొటాషియం, ఫాస్పరస్ వంటి పోషకాలు ఉంటాయి. అరటిపండ్లు లాభాల భాండాగారం అయినప్పటికీ దీనిని తినడం వల్ల జలుబు, దగ్గు వస్తాయని భావిస్తుంటారు. తీవ్రమైన జలుబు, దగ్గు లేదా దగ్గుతో బాధపడేవారు అరటిపండు తినడం మానుకోవాలని నమ్ముతారు. ఎవరికైనా ఈ వ్యాధులు ఉంటే వారు అరటిపండు తినకుండా కూడా నిరోధిస్తుంటారు. అరటిపండుకు సంబంధించిన కొన్ని వాస్తవాలను తెలుసుకుందాం. ఓ నివేదిక ప్రకారం.. జలుబు, ఫ్లూ వైరస్‌లు ఎల్లప్పుడూ మన చుట్టూ ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అయితే అరటిపండ్లు శ్లేష్మాన్ని ప్రోత్సహిస్తాయి కాబట్టి మీరు అనారోగ్యంతో ఉంటే అరటిపండ్లను తినకుండా ఉండాలని ఆమె సూచిస్తున్నారు. కానీ అరటిపండు ఎప్పుడూ ఎలాంటి ప్రత్యక్ష వ్యాధిని కలిగించదు. ఆస్తమా లేదా అలర్జీలతో బాధపడేవారికి ముఖ్యంగా అరటిపండ్లు ఎక్కువగా పక్వానికి వచ్చినట్లయితే, అరటిపండ్లు కొంచెం హానికరం అని చెబుతున్నారు. ఆరోగ్యానికి అరటిపండు చాలా ముఖ్యమైన పండుగా పరిగణించబడుతుంది. జలుబు, దగ్గు రద్దీ నుండి ఉపశమనం పొందడానికి మీరు తులసి, అల్లం, లవంగం, పసుపు వంటి మూలికలను తీసుకోవచ్చు. ఇది కాకుండా మారుతున్న సీజన్లలో మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకోవడానికి పరిశుభ్రత, నిద్రను చూసుకోండి అని నిపుణులు చెబుతున్నారు.

## పనీర్ అతిగా తింటున్నారా?



ఏదైనా ఎక్కువగా తీసుకోవడం హానికరం. పనీర్ విషయంలో కూడా ఇలాంటిదే జరుగుతుంది. పనీర్ ఆరోగ్యకరమైన పాల ఉత్పత్తి. ప్రతిరోజూ తినాలని సిఫార్సు చేస్తారు. అయితే రోజు తినడం వల్ల కొన్ని దుష్ప్రభావాలు కలుగుతాయా? తీవ్రమైన పరిణామాలను నివారించడానికి పనీర్ పరిమిత పరిమాణంలో తినాలని కొందరు నిపుణులు సూచిస్తున్నారు.

పనీర్ కాల్షియం, ప్రోటీన్ వంటి మూలకాల ప్రధాన మూలం. కానీ కొన్నిసార్లు ఇది మిమ్మల్ని అనారోగ్యానికి గురి చేస్తుంది. అందుకే రోజూ పన్నీర్ తినేవాళ్లు కచ్చితంగా కొన్ని విషయాలు తెలుసుకోవాల్సిందే. పనీర్ రోజువారీ ప్రోటీన్, కాల్షియం తీసుకోవడానికి మంచి మూలమని నిపుణులు చెబుతున్నారు. అయితే సాధారణంగా ఒక వ్యక్తి రోజుకు 90 నుండి 100 గ్రాముల పనీర్‌ను మాత్రమే తీసుకోవాలి. ఇంత కంటే ఎక్కువ పనీర్ తింటే తీవ్ర సమస్యలు వస్తాయని కూడా చెబుతున్నారు. బరువు పెరుగుట: పనీర్‌లో అధిక స్థాయిలో కొవ్వు ఉంటుంది. దీని కారణంగా పనీర్ మోతాదుకు మించి తీసుకోవడం వల్ల శరీరంలోని క్యాలరీల సమతుల్యత దెబ్బతింటుంది. ఇది బరువు పెరగడానికి కారణం కావచ్చు. కొలెస్ట్రాల్ స్థాయి పెరుగుదల: పనీర్‌లో చెడు కొవ్వులు, కొలెస్ట్రాల్ ఉంటాయి. ఇది శరీరంలోని కొలెస్ట్రాల్ స్థాయిని అసమతుల్యత చేస్తుంది. ఇటువంటి పరిస్థితిలో పనీర్ ఎక్కువగా తినకుండా ఉండటం చాలా ముఖ్యం. ఎందుకంటే కొలెస్ట్రాల్ పెరుగుదల గుండె జబ్బులను కూడా పెంచుతుంది. జీర్ణ సమస్యలు: రోజులో ఎక్కువ పనీర్ తినడం వల్ల మలబద్ధకం, అతిసారం, అసిడిటీ వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. పనీర్ జీర్ణవ్యవస్థను బాగా ప్రభావితం చేస్తుంది. కిడ్నీ స్టోన్: పనీర్ తీసుకోవడం వల్ల కూడా మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడవచ్చు. ఎందుకంటే ఇందులో అధిక మొత్తంలో కాల్షియం ఉంటుంది. శరీరంలో కాల్షియం ఎక్కువగా ఉండటం కూడా మంచిది కాదు. ఇది కాల్షియం నుండి ఏర్పడిన రాళ్ల పెరుగుదలకు దారితీస్తుంది.

## ఈజీగా పొట్ట తగ్గాలంటే ఈ జ్యూస్ తప్పనిసరిగా తాగాల్సిందే!



మన వంటింట్లో దొరికే కాయగూరలలో క్యారెట్ కూడా ఒకటి. క్యారెట్ వల్ల ఎన్నో రకాల ప్రయోజనాలు ఉన్నాయి అన్న విషయం మనందరికీ తెలిసిందే. క్యారెట్ ను తరచుగా తీసుకోవడం వల్ల ఎన్నో రకాల లాభాలను కూడా పొందవచ్చు. క్యారెట్ కేవలం కంటికి మాత్రమే కాకుండా ఇంకా ఎన్నో రకాల అనారోగ్య సమస్యలకు కూడా ఔషధంగా పనిచేస్తుంది. అయితే కొందరు క్యారెట్ ని పచ్చిగా తినడానికి ఇష్టపడితే మరి కొందరు కూరల రూపంలో తినడానికి ఇష్టపడుతూ ఉంటారు. ఇకపోతే ఈ క్యారెట్ జ్యూస్ తో బాణా లాంటి పొట్ట అయినా సరే ఈజీగా కరిగించుకోవచ్చు అని చెబుతున్నారు. క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల మలబద్ధకం తొలగిపోయి జీర్ణ సమస్యల నుంచి విముక్తి పొందవచ్చుట. క్యారెట్ లో క్యాలరీలు తక్కువగా ఉండి ఫైబర్ ఎక్కువగా ఉండటం వలన మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.

అలాగే ఇందులో పోషకాలు ఎక్కువగా ఉండటం వల్ల శరీరంలోని ద్రవాల సమతుల్యతకు ఆస్కారం ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. క్యారెట్ జ్యూస్ డిహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుందట. అధిక బరువు సమస్యతో బాధపడేవారు పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా ఉంది అని బాధపడేవారు క్యారెట్ జ్యూస్ తాగడం వల్ల అందులో ఉండే విటమిన్ బి వన్, బి టు,బి సిక్స్ లు అధిక కొవ్వును కరిగించడంలో ఎంతో బాగా పనిచేస్తాయట. ప్రోటీన్లను, కొవ్వులను జీర్ణం అయ్యేలా చేయటంలో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తాయిట. ఇందులో ఉండే బిటమిన్ శరీరంలోని మెటబాలిజాన్ని పెంచుతుంది క్యాలరీలు వేగంగా ఖర్చు అవ్వటంతో కొవ్వు కరిగి బరువు బాగా తగ్గేందుకు క్యారెట్ జ్యూస్ ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అయితే క్యారెట్ జ్యూస్ ను ఎలా తయారు చేసుకోవాలంటే.. ముందుగా క్యారెట్లు చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకుని మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసుకోవాలి, తర్వాత యాలకులు, పుదీనా వేసి మరొకసారి మిక్సీ చేసుకొని వచ్చిన నీటిని వడపోసుకోవాలి. రుచి కోసం కొంచెం తేనె కలుపుకోవచ్చు. ఈ జ్యూస్‌ని రోజుకి ఒక గ్లాస్ చొప్పున టిఫిన్ చేసే సమయానికి ముందు తీసుకుంటే మంచిది. ఇందులో ఉండే ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం, మాంగనీస్ లు రోగనిరోధక శక్తిని పెంపొందించి కొవ్వులని కరిగిస్తాయి. హైబీపీని కూడా అదుపులో ఉంచుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## ఈ జ్యూస్‌లతో షుగర్ లెవెల్ కంట్రోల్ అవుతుంది!



దీపావళి పండుగ ఆనందం, దీపాలు, తీపికి చిహ్నం. ఈ సమయంలో మనమందరం చాలా స్వీట్లను తినేసి ఉంటాం. ఇది మన ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా మీరు చక్కెర స్థాయిని పెంచడం, తగ్గించడం వంటి సమస్యలను కలిగి ఉంటే చింతించాల్సిన అవసరం లేదు. కొన్ని ఆరోగ్యకరమైన గ్రీన్ జ్యూస్‌ల గురించి మీకు తెలియజేస్తున్నాము. వీటిని తీసుకోవడం ద్వారా మీరు మీ చక్కెర స్థాయిని సమతుల్యం చేసుకోవచ్చు. వీటిని తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. ఈ రసం మీ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది. మీ చక్కెర స్థాయిని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. పాలకూరలో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. దోసకాయలో నీరు ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఈ జ్యూస్ తాగడం వల్ల శరీరంలో షుగర్ స్పైక్ అవ్వదు. దీన్ని చేయడానికి మీరు సగం దోసకాయ మరియు 1 కప్పు పాలకూర తీసుకోవాలి. ఈ రెండింటినీ కలిపి మిక్సీలో గ్రైండ్ చేసి, నిమ్మరసం, కొద్దిగా బ్లాక్ సాల్ట్ వేసి కలిపి తాగాలి. సెలెరీ (కొత్తిమీర) తక్కువ కేలరీల ఆహారం. దీన్ని తీసుకోవడం వల్ల శరీరంలో బ్లడ్ షుగర్ లెవెల్స్ సమతుల్యంగా ఉంటాయి. ఈ జ్యూస్ తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు దీపావళి, పండుగల సమయంలో ఈ జ్యూస్ తాగవచ్చు. దీన్ని చేయడానికి మీరు ఆకుకూరలను చిన్న ముక్కలుగా కట్ చేసి, రసం తీయడానికి జ్యూసర్‌లో వేయాలి. ఆ తరువాత తేనెలో నిమ్మరసంతో కలిపి త్రాగాలి. కాకరకాయ చేదు అయినప్పటికీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఒక వరం. కాకరకాయలో ఉండే సమ్మేళనాలు ఇన్సులిన్ స్థాయిలను నియంత్రిస్తాయి. ఈ జ్యూస్‌ని కొన్ని రోజుల పాటు నిరంతరం తాగడం వల్ల షుగర్ పేషెంట్లకు లాభాలు లభిస్తాయి. కాకరకాయ రసం చేయడానికి, మీరు కాకరను చిన్న ముక్కలుగా కట్ చేయాలి. ఆ తర్వాత గింజలు తీసి మిక్సీలో మెత్తగా చేయాలి. ఇప్పుడు వడపోసి నిమ్మరసం వేసి తాగాలి.

## వారానికి ఒక్కసారైనా తినండి..!



ఆకుకూరలు మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని చెప్పడంలో సందేహం లేదు. తోటకూర, పాలకూర, బీట్‌రూట్, పాలకూరతో పాటు, మెంతులు కూడా మన ఆరోగ్యానికి చాలా ముఖ్యమైనవి. మెంతికూరలోని పోషకాలు మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. మెంతులు మన గుండె ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా మన శరీరంలో పేర్కొన్న చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయి. చాలా మంది జీర్ణ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు. అలాంటి వారికి మెంతులు బాగా పని చేస్తాయి. ముఖ్యంగా అజీర్ణం, కడుపునొప్పి, గ్యాస్ సమస్యలతో బాధపడేవారికి మెంతులు బాగా ఉపయోగపడతాయి. ఇది జీర్ణ సమస్యలను తగ్గించడంలో వారికి సహాయపడుతుంది.

బరువు తగ్గాలనుకునే వారికి మెంతికూర.. బరువు తగ్గాలనుకునే వారికి మెంతికూర కూడా చాలా మంచిదని డైటీషియన్లు చెబుతున్నారు. ఇందులో ఉండే పీచు పదార్థం మనకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది మరియు అతిగా తినకుండా చేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు మెంతికూర దివ్య ఔషధంగా చెబుతారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మెంతులు కీలక పాత్ర పోషిస్తాయి. టైప్ 2 డయాబెటిస్‌తో బాధపడేవారు మెంతికూరను ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. చర్మ ఆరోగ్యాన్ని మెంతికూర.. చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా మెంతులు బాగా పని చేస్తాయి. మెంతికూరలోని పోషకాలు మన శరీరంలోని టాక్సిన్స్‌ను బయటకు పంపి మన చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. చర్మాన్ని ముడతలు లేకుండా యవ్వనంగా మార్చుతుంది. మెంతికూరలో కాల్షియం, మెగ్నీషియం మరియు విటమిన్ డి పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని కాపాడతాయి. చలికాలంలో మెంతికూర తినడం చాలా మంచిది. మెంతికూర తినడం వల్ల మనలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

శరీరానికి విటమిన్లు, మినరల్స్... మెంతులు శరీరంలో వేడిని కూడా ఉత్పత్తి చేస్తాయి. మెంతికూర తీసుకుంటే మన శరీరానికి విటమిన్లు, మినరల్స్ మరియు ఫైబర్ అవసరం. మెంతులు మన హార్మోన్లను సమతుల్యం చేయడానికి మరియు మనల్ని ఆరోగ్యంగా ఉంచడానికి సహాయపడతాయి. లైంగిక సమస్యలకు కూడా మెంతులు పరిష్కారంగా చెప్పవచ్చు. రుతుక్రమ సమస్యలతో బాధపడేవారు మెంతికూర తినడం వల్ల ఆ సమస్య నుంచి కొంత వరకు బయటపడవచ్చు. వారానికి ఒకసారి మెంతికూర తింటే మంచి ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి అనడంలో సందేహం లేదు.

## ఈ పదార్థాలను రోజు తింటున్నారా?



ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే కచ్చితంగా తెల్లని ఆహారాలకు దూరంగా ఉండాలి అంటున్నారు నిపుణులు. ఈ ఆహారాలు రుచికరంగా ఉంటాయి కానీ ఆరోగ్యానికి విషమట. అయితే ఓ 5 వైట్ ఫుడ్స్ ను దూరం చేస్తే సగానిపైగా సమస్యలు దూరం అవుతాయట. ఆరోగ్యం కూడా మీ చేతుల్లోనే ఉంటుంది అంటున్నారు నిపుణులు. అటువంటి 5 వైట్ ఫుడ్స్ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.తెల్ల చక్కెర: శరీరంలో మంట, కేలరీలు, లిపిడ్లు, చక్కెర స్థాయిని పెంచడానికి తెల్ల చక్కెర ప్రధాన పాత్ర వహిస్తుంది. దీన్ని అధికంగా తీసుకుంటే మాత్రం మధుమేహం నుంచి గుండె జబ్బుల వరకు ఎన్నో ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది.తెల్ల రొట్టె: వైట్ బ్రెడ్ ను చాలా మంది ఇష్టంగా తింటారు. కానీ ఇది ఆరోగ్యానికి సురక్షితం కాదు. ఇందులో ఫైబర్ అసలు ఉండదు. ఇక ఈ రొట్టె జీర్ణక్రియకు హాని కలిగిస్తుంది. అంతే కాకుండా దీన్ని తినడం వల్ల షుగర్ పెరుగుతుంది అంటున్నారు నిపుణులు. తెల్ల బియ్యం: ప్రతి ఒక్కరు ఎక్కువగా అన్నం తింటారు. ఈ అన్నం గురించి అందులోని విటమిన్లు, మినరల్స్ గురించి కూడా చాలా సార్లు తెలుసుకునే ఉంటారు. ఇక ఈ అన్నానికి బదులు చపాతీలు తినడం బెటర్ అంటారు నిపుణులు. అన్నం చాలా తక్కువ తినాలని, దీనికి బదులు బ్రౌన్ రైస్ కూడా తినవచ్చు అంటున్నారు నిపుణులు. అయితే ఈ తెల్ల బియ్యం కూడా శరీరానికి మంచివి కావట. అయితే పాలిష్ చేయడం వల్ల ఇందులోని చాలా పోషకాలు పోతాయి. ఇందులో అత్యధిక కార్బోహైడ్రేట్లు ఉంటాయి.

ఊబకాయం, గుండె జబ్బులు, మధుమేహం వంటి సమస్యలను పెంచుతాయి.తెల్ల ఉప్పు: ఉప్పు లేకుండా ఒక రోజు కూడా గడవదు కద. కూరలో ఉప్పు తక్కువ అయితే చాలు అన్నాన్ని పక్కన పెట్టేస్తుంటారు చాలా మంది. అయితే అధిక మోతాదులో తెల్ల ఉప్పు తీసుకుంటే మాత్రం అధిక రక్తపోటు, గుండె జబ్బులు వస్తాయి అంటున్నారు నిపుణులు. బదులుగా, సముద్రపు ఉప్పు లేదా పింక్ ఉప్పును ఉపయోగించండి.. ఇవి మరింత సహజమైనవి.. తెల్ల వెన్న: వైట్ బటర్ వంటి ప్రాసెస్ చేసిన కొవ్వులు కూడా గుండెకు హాని చేస్తాయి అంటున్నారు నిపుణులు. బదులుగా ఆలివ్ నూనె లేదా కొబ్బరి నూనె ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

